సాక్షి
అన్నమయ్య జిల్లా

ఆదివారం । 11 । జూన్ । 2023



ఉద్యోగ ప్రాప్తిరస్తు!

కడపలో సాక్షి మీడియా గ్రూపు, హైదరాబాద్ ఆర్.సి. ఎగ్జామ్స్ సంస్థ ఆధ్వర్యంలో గ్రూపు–2 పోటీపరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. - 8లో



యువకుడి ఆత్మహత్యాయత్నం

బెట్టింగ్‌లకు పాల్పడి డబ్బు నష్టపోయిన ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన బి.కొత్తకోటలో జరిగింది. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.230	రూ.300
రెండోరకం	రూ.150	రూ.220

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1,203 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	401	401
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 18.60 కిలోలు

న్యూస్‌రీల్

2న అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: పౌర్ణమి పురస్కరించుకుని వచ్చే నెల 2న అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు వన్ డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. రెండు అల్ట్రా డీలక్స్ బస్సులు, నాలుగు ఎక్స్‌ప్రెస్ బస్సులు నడుపుతామన్నారు. భక్తులు ముందుగానే ఆన్‌లైన్‌లో బస్సు సీట్లు రిజర్వేషన్ చేసుకోవాలన్నారు. నాలుగు టిక్కెట్ల కంటే ఎక్కువ ఉంటే వారి వద్దకే వచ్చి టిక్కెట్లు అందిస్తామన్నారు. ఆర్టీసీ ప్రయాణం సురక్షితమన్నారు. మరిన్ని వివరాలకు 7382875034, 7382875460 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

సాఫ్ట్‌వేర్ డెవలపర్, డేటా ఎంట్రీపై ఉచిత శిక్షణ

మదనపల్లె: ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి కౌశల్ వికాస్‌యోజన పథకం ద్వారా నిరుద్యోగ యువతీ యువకులకు జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, డేటాఎంట్రీ కోర్సులపై ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి బి.హరికృష్ణ తెలిపారు. మదనపల్లె జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్‌హబ్‌లో ఈనెల 12 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. పదోతరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా అర్హత కలిగిన నిరుద్యోగ అభ్యర్థులు ఆన్‌లైన్‌లో తమ వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. చివరి తేదీ 11గా నిర్ణయించామన్నారు. పూర్తి వివరాలకు 9553202509 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని జీఎంఆర్ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఈఎంసీ ఆంజనేయులు తెలిపారు.

మహిళల భద్రత, రక్షణకు దిశయాప్



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ గంగాధర్‌రావు

రాయచోటి : మహిళల భద్రత రక్షణకు 'దిశ' యాప్ ఒక రక్షణ కవచంలా పనిచేస్తుందని జిల్లా ఎస్పీ గంగాధర్‌రావు అన్నారు. శనివారం ఆయన అన్నమయ్య జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలు నుంచి జిల్లాలోని మహిళా పోలీసులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామ, వార్డు మహిళా పోలీసులు కలిసి మహిళలు, యువతకు దిశ యాప్‌పై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఆపద సమయంలో దిశ యాప్ ఒక రక్షణ కవచంలా ఉపయోగపడుతుందన్న నమ్మకాన్ని వారిలో కలిగేలా చూడాలన్నారు. ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా అవగాహన కల్పించాలన్నారు. జిల్లా అదనపు ఎస్పీ వీబీ రాజ్‌కమల్, సైబర్ క్రైమ్ ఎస్‌ఐ బాలకృష్ణ, దిశా ఎస్‌ఐ బిందుమాధవి పాల్గొన్నారు.

నేను విన్నాను.. నేను ఉన్నాను!

- అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గంలోని బి.కొత్తకోట పరిధిలో ఇసుక అక్రమంగా తరలిస్తున్నారని నేరుగా జగనన్నకు చెబుదాం కార్యక్రమ టోల్ ఫ్రీ నంబరుకు ఫిర్యాదు చేశారు. దీంతో వెంటనే స్పందించిన అధికారులు మూడు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేశారు.
- మదనపల్లె మండల పరిధిలోని ఓ గ్రామంలో తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్న ప్రజలు నేరుగా జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా టోల్‌ఫ్రీ నంబరుకు ఫిర్యాదు చేశారు. అక్కడి నుంచి జిల్లా పంచాయతీరాజ్‌శాఖ అధికారులకు తెలియజేసి వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. అంతేకాకుండా తాగునీటి సమస్య పరిష్కారానికి తాత్కాలికంగా ట్యాంకర్‌ను ఏర్పాటు చేసి నీటిని అందిస్తున్నారు.
- మండల కేంద్రమైన లక్కిరెడ్డిపల్లెకు చెందిన ఓ యువకుడు తన పాస్‌పోర్టు విషయమై జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్నాడు. చాలా రోజులుగా ఇబ్బంది పడుతున్నానని వెంటనే పరిష్కరించాలని కోరగా, జిల్లా పోలీసు యంత్రాంగం కేవలం దరఖాస్తు చేసిన ఒకరోజుకే క్లియర్ చేసింది.

- రోజురోజుకు పెరుగుతున్న జగనన్నకు చెబుదాం ఫోన్ కాల్స్
- 1902 టోల్‌ఫ్రీ నంబరుకు నేరుగా ఫిర్యాదు చేస్తున్న బాధితులు
- ఇప్పటివరకు 1347 దరఖాస్తులకు 804కు పైగా పరిష్కారం
- రెవెన్యూ, హౌసింగ్, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించి ఎక్కువ ఫోన్ కాల్స్
- ఎప్పటికప్పుడు సీఎంఓ నుంచి పర్యవేక్షిస్తున్న జిల్లా యంత్రాంగం



జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో సమస్యలను కలెక్టర్‌కు వివరిస్తున్న ప్రజలు (ఫైల్)



సాక్షి రాయచోటి : దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రజల ఫిర్యాదులను ఇప్పటికే స్పందన కార్యక్రమం ద్వారా పరిష్కరిస్తూ వస్తున్నప్పటికీ మరింత నాణ్యతతో కూడిన పరిష్కారాన్ని అందించాలన్న సంకల్పంతో జగనన్నకు చెబుదాం అనే కొత్త కార్యక్రమానికి అంకురార్పణ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల ఫిర్యాదులను సులభతరమైన.. ఎలాంటి అవాంతరాలు లేకుండా పరిష్కారం వేగవంతంగా చేసేలా పథక రచన చేశారు. మే 9వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతేకాకుండా ప్రత్యేకంగా ఒక టోల్‌ఫ్రీ నంబరు 1902ను సూచిస్తూ.. నేరుగా ఫిర్యాదులను స్వీకరించేలా సిబ్బందిని నియమించారు. ప్రత్యేకంగా ముఖ్యమంత్రి కార్యాలయం నుంచే బాధితులతో మాట్లాడుతూ మానిటరింగ్ చేయడంతోపాటు.. ఎప్పటికప్పుడు వారి సమస్య ఏ స్థాయిలో ఉందో తెలుసుకునేలా ట్రాకింగ్‌ను చేసేలా చర్యలు చేపట్టారు.

నేరుగా జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి దరఖాస్తులు

అన్నమయ్య జిల్లాలో జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి సంబంధించి దరఖాస్తులు నేరుగా వెళుతున్నాయి. స్పందన కార్యక్రమంలో రిజిష్టర్ చేసే వాటిని కూడా జగనన్నకు చెబుదాం కార్యక్రమానికే అనుసంధానం చేస్తున్నారు. తద్వారా దరఖాస్తుదారునికి తన సమస్యను నిర్ణీత గడువులోపల పరిష్కరించేలా రశీదును అందిస్తున్నారు. కొంతమంది నేరుగా 1902 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి వివరిస్తుండగా, తక్షణ పరిష్కారం లభిస్తోంది. జిల్లా నుంచి అనేక రకాల సంక్షేమ పథకాలకు సంబంధించిన సమస్యలతోపాటు ఇతర సమస్యలను సైతం నేరుగా తెలియజేస్తున్నారు.

1347 దరఖాస్తులకు 804కు పైగా పరిష్కారం

జిల్లాలో జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి సంబంధించి సుమారు 1347 మంది సమస్యలను తెలియజేయగా, ఇప్పటివరకు 807కు పైగా సమస్యలను పరిష్కరించారు. 451 సమస్యలకు సంబంధించిన దరఖాస్తులకు ఇంకా గడువు ఉంది. రెవెన్యూ సమస్యలకు సంబంధించి 518 మంది దరఖాస్తులు సమర్పించగా, 160కి పైగా క్లియర్ చేశారు. పోలీసులకు సంబంధించి 92 దరఖాస్తులు రాగా 68 వరకు క్లియర్ అయ్యాయి. పంచాయతీరాజ్ విభాగానికి సంబంధించి 149 వరకు దరఖాస్తులు రాగా, వాటిలో దాదాపు 64 దరఖాస్తులు క్లియర్ చేశారు. అలాగే హౌసింగ్‌కు సంబంధించి 90 దరఖాస్తులు రాగా, 88 దరఖాస్తులను పరిష్కరించారు. నిర్దేశిత గడువులోగానే సమస్యలకు పరిష్కారం లభిస్తుండడంతో జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీఎంఓ కార్యాలయం నుంచి పరిశీలన

రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి దరఖాస్తుకు సంబంధించి ఎప్పటికప్పుడు సీఎంఓ కార్యాలయం నుంచే పరిశీలన చేస్తున్నారు. నిర్దేశిత గడువులోగా సమస్యలను పరిష్కరించేలా, అందులోనూ నాణ్యతతో జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి అక్కడి నుంచే ఫోన్ చేసి వివరాలు అడగడంతోపాటు సంబంధిత అధికారి ద్వారా పరిష్కారానికి చొరవ చూపుతున్నారు. బాధితుల దరఖాస్తులను పరిష్కరించిన తర్వాత కూడా తిరిగి వారికి ఫోన్ చేసి సంతృప్త స్థాయిని కూడా తెలుసుకుంటున్నారు. ఇప్పటివరకు అన్నమయ్య జిల్లాలో 328 మంది ఫోన్‌కాల్స్ చేయగా, 181 మంది సంతృప్తి వ్యక్తం చేయగా, 141 మంది పర్వాలేదన్నట్లుగా తెలియజేశారు. సంతృప్త స్థాయి 56 శాతంగా నమోదైంది. మదనపల్లె నుంచి 75 మంది, రాయచోటి నుంచి 66, రామాపురం నుంచి 62 జిల్లా స్థాయిలో అత్యధికంగా దరఖాస్తులు వెళ్లాయి.

ప్రతిష్టాత్మకంగా తీసుకుని పరిష్కరిస్తున్నాం



అన్నమయ్య జిల్లాలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని అధికారులందరూ ప్రతిష్టాత్మకంగా తీసుకుని పనిచేస్తున్నారు. ఎప్పటికప్పుడు వారం వారం వాటిమీద ప్రత్యేక సమీక్షలతోపాటు పర్యవేక్షణ జరుగుతోంది. నాణ్యతతో పరిష్కారం అయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. అందులోనూ గడువులోపలే పరిష్కరిస్తున్నాం. సమస్య ఏదైనా సత్వర పరిష్కారమే లక్ష్యంగా కృషి జరుగుతోంది. సమస్యల పరిష్కారానికి సంబంధించి ఆడిట్‌తోపాటు నోడల్ టీములు పర్యవేక్షిస్తున్నాయి. ఎక్కడా కూడా అలసత్వం లేకుండా అధికారులందరూ వేగవంతంగా పని చేస్తూ పరిష్కారానికి చొరవ చూపుతున్నారు.

– గిరీషా పీఎస్, కలెక్టర్, అన్నమయ్య జిల్లా

అది పాదయాత్ర కాదు... ఫ్యాషన్ యాత్ర

- రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయడం తగదు
- నా నిజాయితీ ఏమిటో మీ తండ్రినడుగు
- ప్రజా సేవే నా ప్రథమ లక్ష్యం
- లోకేష్ వ్యాఖ్యలపై జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి ఆగ్రహం



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

కడప కార్పొరేషన్: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేస్తున్నది పాదయాత్ర కాదని, ఫ్యాషన్ యాత్ర అని జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి అన్నారు. శనివారం ఇక్కడి వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాదయాత్ర పేరుతో సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకూ తిరుగుతూ ఏ నియోజకవర్గానికి వెళితే ఆ ఎమ్మెల్యేను, ముఖ్య నాయకులను తిట్టడం అలవాటుగా మార్చుకున్నారన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశామో, మళ్లీ అధికారంలోకి వస్తే ఏం చేస్తామో చెప్పకుండా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. తాను భూములు ఆక్రమించినట్లు ఆరోపించడం అన్యాయమన్నారు. తరతరాలుగా తమది భూస్వాముల కుటుంబమని, అనేక ఏళ్లుగా తాము ప్రజాసేవే పరమావధిగా పని చేస్తున్నామన్నారు. 20 ఏళ్లక్రితమే గుడులు, బడులు కట్టామని, చుట్టు పక్కల గ్రామాల్లో ఏ ఒక్కరైనా తాను ఆక్రమించినట్లు చెబితే వారికే రాసిస్తానన్నారు. తమ ఇల్లు దేవాలయం లాంటిదని అక్కడ కంటి ఆసుపత్రి ఏర్పాటు చేసి, ఇంట్లో ఉచిత వివాహాలు చేస్తుంటామన్నారు. తన నిజాయితీ ఏమిటో మీ తండ్రిని అడగాలని సూచించారు. మేడా మల్లికార్జునరెడ్డి టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి వచ్చినప్పుడు చంద్రబాబు ఎంతమందిని పంపి సంప్రదించారో తెలుసుకోవాలన్నారు. ఎవరో రాసిచ్చింది చదవడం మాని, వాస్తవాలు తెలుసుకోవాలని హితవు పలికారు.

పాడి రైతులకు శుభవార్త

కడప అగ్రికల్చర్: రాష్ట్ర ప్రభుత్వం, ది కైరా జిల్లా కోఆపరేటివ్ పాల ఉత్పత్తిదారుల సమితి(అమూల్ డెయిరీ) ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జగనన్న పాల వెల్లువ కార్యక్రమంలో భాగంగా 5వ సారి పాల కొనుగోలు ధరను పెంచింది. ఇందులో ఆవుపాలు (ఫ్యాట్: 3.5%, ఎస్ఎన్ఎఫ్ 8.5%) ప్రస్తుత ధర రూ. రూ.34.59 ఉండగా లీటర్‌పై రూ. రూ. 1.22 పెంచి రూ. 35.82 చేసింది. అలాగే గేదెపాలు (ఫ్యాట్ 6%. ఎస్ఎన్ఎఫ్ 9%) ప్రస్తుతం రూ. 45.96 ఉండగా లీటర్‌పై రూ.1.91 పెంచుతూ లీటర్‌కు రూ. 47.88 చేసింది. ఈ పెరిగిన ధరలు 11వ తేదీ నుంచి అమలులోకి రానున్నాయి.

11 వేల మందికి లబ్ధి..

ఈ పెరిగిన పాల ధరలతో వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, సత్యసాయితోపాటు తిరుపతి జిల్లాలకు చెందిన 11 వేల మంది పాల ఉత్పత్తిదారులకు ప్రయోజనం చేకూరనుంది. ప్రస్తుతం కైరా అమూల్ డెయిరీ వారు వైఎస్ఆర్, సత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో రోజుకు 90 వేల లీటర్ల పాలు సేకరిస్తున్నారు. ఇందులో అన్నమయ్య జిల్లాలో 48 వేల లీటర్లు, వైఎస్సార్‌లో 14 వేల లీటర్లు, సత్యసాయి 14 వేల లీటర్లు, చిత్తూరులో 9 వేల లీటర్లు, తిరుపతిలో 5 వేల లీటర్లు వస్తున్నాయి.

యువగళం కాదు.. యమగళం

- ఇసుక వ్యాపారం చేసినట్లు నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధం
- అన్నమయ్య డ్యాం కొట్టుకుపోవడంలో నా పాత్ర ఉందంటే రాజకీయాలనుంచి వైదొలుగుతా
- లోకేశ్‌పై నిప్పులు చెరిగిన ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

రాజంపేట రూరల్: తండ్రి నుంచి నీచ సంస్కృతి అంది పుచ్చుకున్న లోకేశ్ నీవు చేసేది యువగళం పాదయాత్ర కాదు యమగళం పాదయాత్ర అని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి దుయ్యబట్టారు. రాజంపేటలోని మేడా నిలయంలో శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాదయాత్ర అంటే వైఎస్సార్ కుటుంబీకులు చేసింది అని లోకేశ్‌కు హితబోధ చేశారు. పాదయాత్ర చేసేది ప్రజల కష్టాలను తెలుసు కోవడానికా, ఇతరులు రాసిచ్చిన స్క్రిప్టును అవగాహన లేకుండా చదవడానికా అని మండిపడ్డారు. వార్డు మెంబర్‌గా కూడా గెలవని నువ్వు నీ వెనుక ఉన్న చెంచాలు రెండు పర్యాయాలు ప్రజల మద్దతుతో ఎమ్మెల్యేగా గెలిచిన తనను విమర్శించడమా అని ప్రశ్నించారు. అన్నమయ్య డ్యాం కొట్టుకుపోవడంలో తనపాత్ర ఉందని నిరూపిస్తే శాశ్వతంగా రాజకీయాలనుంచి వైదొలుగుతానని సవాల్ విసిరారు. తాను గానీ తన కుటుంబసభ్యులు గానీ ఇసుక వ్యాపారం చేసినట్లు నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధమన్నారు. జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డిని, తనను విమర్శించే నైతిక అర్హత లోకేశ్‌కు లేదన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జి.సుబ్బారెడ్డి, పి.సుధాకర్, బి.రామ్మోహన్‌నాయుడు, జేవీ కృష్ణారావు, వి.గంగిరెడ్డి, వి.రమణ, ఎస్.అమీర్, నీలకంఠారెడ్డి, ఎస్.రామకృష్ణ, మురళీఆచారి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ హంగులు.. సకల సౌకర్యాలు

- ఏపీ మోడల్ స్కూళ్లలో సీట్లకు భలే డిమాండ్
- 6వ తరగతిలో ప్రవేశానికి నేడు పరీక్ష
- ఇంగ్లీషు మీడియం బోధనతో మంచి ఫలితాలు



వల్లూరులోని ఏపీ మోడల్ స్కూల్

వల్లూరు: నేటి ఆధునిక ప్రపంచం పోటీ ప్రపంచంగా మారింది. విద్య, ఉద్యోగం ఒకటేమిటి ఇలా ప్రతిదానికి పోటీ తీవ్రంగా ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ఆంగ్లంపై పూర్తి స్థాయిలో పట్టున్నవారే ఉన్నత విద్యావకాశాలను అందిపుచ్చుకుని ఉద్యోగాలను సొంతం చేసుకోగలుగుతున్నారు. అందుకే ప్రతి నిరుపేద విద్యార్థి ఉన్నత చదువులు చదవాలనే ధ్యేయంతో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 2009 సంవత్సరంలో మోడల్ స్కూళ్ల ఏర్పాటుకు అంకురార్పణ చేశారు.

పేద, మధ్య తరగతి కుటుంబాల పిల్లలకు మంచి చదువులే ధ్యేయం

పేద, మధ్య తరగతి కుటుంబాల పిల్లలకు కూడా మంచి చదువులను అందించాలనే ఉద్దేశంతో ఏపీ మోడల్ స్కూళ్ల ప్రారంభానికి అడుగులు పడ్డాయి. వెనుక బడిన మండలాలను గుర్తించి ఈ పాఠశాలలను ప్రారంభించారు. ఇక్కడ ఆరవ తరగతిలో ప్రవేశం పొందితే ఇంటర్ వరకు ఇంగ్లీషు మీడియం విద్యను అందించడంతో పాటు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తున్నారు. తొమ్మిది నుంచి ఇంటర్ వరకు చదివే బాలికలకు కార్పొరేట్ తరహా హాస్టల్ వసతిని ఏర్పాటు చేశారు. ఈ పాఠశాలలు గ్రామీణ పేద విద్యార్థులకు వరంగా మారాయి. ఇప్పటి వరకు ఈ పాఠశాలల్లో చదివిన వారిలో అధిక శాతం ఉన్నత విద్యలో రాణిస్తున్నారు. ఎంసెట్, నీట్‌లతో బాటు ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధిస్తూ తమ కలలను సాకారం చేసుకుంటున్నారు.

అందుబాటులోని తరగతులు: 6 నుంచి ఇంటర్ వరకు
మీడియం: ఇంగ్లీషు
సెక్షన్లు: 10 వరకు ఒక్కో తరగతికి రెండు సెక్షన్లు
సీట్ల సంఖ్య: సెక్షన్‌కు 50 మంది చొప్పున
ఎంపిక ఇలా: ఆరవ తరగతి సీట్లను ప్రవేశ పరీక్ష నిర్వహించి మెరిట్ ప్రాతిపదికన రోస్టర్ నిబంధనల మేరకు కేటాయిస్తారు.

ప్రవేశ పరీక్షపై అవగాహన కల్పించాం



ఏపీ మోడల్ స్కూళ్లు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యా బోధన అందిస్తున్నాయి. నిరుపేద విద్యార్థులు నాణ్యమైన ఉచిత ఇంగ్లీషు మీడియం విద్యను పొందేందుకు ఇది చక్కటి అవకాశం. విద్యార్థులకు పరీక్షా విధానం, ఓఎంఆర్ షీట్‌లో బబుల్ చేయడంపై అవగాహన కల్పించాం.

– సి. దిలీప్ కుమార్, ప్రిన్సిపల్, ఏపీ మోడల్ స్కూల్, సంబేపల్లె, అన్నమయ్య జిల్లా

నేడు ప్రవేశ పరీక్ష



గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లలకు కార్పొరేట్ విద్యను అందించాలనే ధ్యేయంతో ఏపీ మోడల్ స్కూల్స్‌ను ప్రారంభించారు. 6 వ తరగతిలో ప్రవేశానికి ఆదివారం ప్రవేశ పరీక్ష జరుగుతుంది.

– సురేష్ బాబు, ప్రిన్సిపల్, ఏపీ మోడల్ స్కూల్, వల్లూరు

వైఎస్ఆర్ జిల్లాలో ఏపీ మోడల్ స్కూళ్లు ఇవే..

జిల్లాల విభజనకు ముందు ఉమ్మడి కడప జిల్లాలో 10 ఏపీ మోడల్ స్కూళ్లు ఉండేవి. విభజన తరువాత మూడు స్కూళ్లు మాత్రమే జిల్లాలో మిగిలాయి, అవి వల్లూరు, ఖాజీపేట, శ్రీ అవధూత కాశినాయన మండలం.

అన్నమయ్య జిల్లాలో...

ఉమ్మడి కడప జిల్లాలోని 7 స్కూళ్లు, ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 10 స్కూళ్లు కలిపి అన్నమయ్య జిల్లాలో మొత్తం 17 ఏపీ మోడల్ స్కూళ్లు ఉన్నాయి. అవి చిన్నమండెం, సంబేపల్లె, రామాపురం, పెనగలూరు, రాయచోటి, పుల్లంపేట, లక్కిరెడ్డిపల్లె, రామసముద్రం, నిమ్మనపల్లె, కురబలకోట, కొత్తకోట, ములకలచెరువు, తంబళ్లపల్లె, పెద్దతిప్పసముద్రం (పీటీఎమ్), పెద్దమండ్యం, కలకడ, కేవీపల్లె.

క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్య

మదనపల్లె : తల్లిదండ్రుల మధ్య ఘర్షణలు జీర్ణించుకోలేని ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం పుంగనూరు నియోజకవర్గంలో జరిగింది. చౌడేపల్లె మండలం మిట్టూరుకు చెందిన రమణప్ప, రత్నమ్మ దంపతుల కుమారుడు విజయ్‌కుమార్(27) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తల్లిదండ్రులు రమణప్ప, రత్నమ్మలు తరచూ గొడవ పడటమే కాకుండా ఈ మధ్యనే కొద్దిరోజుల క్రితం విడిపోయారు. తల్లిదండ్రులు తన యుక్తవయస్సులో విడిపోవటాన్ని జీర్ణించుకోలేని విజయకుమార్ శుక్రవారం రాత్రి పురుగులమందు తాగాడు. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌లో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తుండగా శనివారం ఉదయం మృతిచెందాడు. చౌడేపల్లె పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

బావిలో పడి మహిళ మృతి

గాలివీడు : బావిలో పడి వివాహిత మృతి చెందిన సంఘటన శనివారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటశివకుమార్ కథనం మేరకు రాయచోటి పట్టణం రాయుడి కాలనీకి చెందిన వలి రెండో భార్య కదిరున్నిసా కుమార్తె షాహిల్ తాజ్(28) భర్త రియాజ్‌తో కుటుంబ కలహాల కారణంగా పదేళ్ల నుంచి దూరంగా ఒంటరిగా జీవనం సాగిస్తోంది. ఈమెకు ఐదుగురు సంతానం, పోషణకోసం భవన నిర్మాణ కార్మిక కూలిగా మారింది. ఇదే క్రమంలో శనివారం మండలంఓలని సీసీపల్లె గ్రామ పంచాయతీ కడప వాండ్లపల్లెలో కూలి పనులకు వెళ్లింది. మధ్యాహ్నం తోటి కూలితో కలిసి పక్కనే గల బావిలో ఈతకొట్టేందుకు వెళ్లారు. ప్రమాదవశాత్తు తన కుమారుడు నిజాం బావిలో మునిగిపోతుండగా రక్షించే ప్రయత్నంలో షాహిల్‌తాజ్ మృత్యువాత పడినట్లు ఎస్‌ఐ తెలిపారు. నిజాంను తోటి కూలీలు బావిలో నుండి సురక్షితంగా బయటకు తీసుకొచ్చినట్లు తెలిపారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై టీడీపీ నాయకుడి దాడి

రాయచోటి : వైఎస్సార్‌సీపీ కార్యకర్త మధన మోహన్‌రెడ్డిపై టీడీపీ నాయకుడు మల్లు ధీరజ్ రెడ్డి దాడి చేశారు. వివరాలు.. మండలంలోని శెట్టిపల్లె పంచాయతీలోని రెడ్డివల్లువారిపల్లెకు చెందిన మధన్‌మోహన్‌రెడ్డి ఆదే గ్రామంలోని తిమ్మక్కగారిపల్లెలో జరుగుతున్న స్నేహితుడి వివాహానికి వెళ్లాడు. అదే పెళ్లికి టీడీపీ నాయకుడు, మాజీ జెడ్పీటీసీ నరసారెడ్డి తమ్ముడు కుమారుడు ధీరజ్‌రెడ్డి వెళ్లాడు. ఈ క్రమంలో ధీరజ్‌రెడ్డి మధన్‌మోహన్‌రెడ్డి దగ్గరకు వచ్చి గతంలో నీవు మా పార్టీకి వ్యతిరేకంగా చేస్తావా, చంద్రారెడ్డి కొడుకు నీవే కదా అంటూ కుర్చీతో కొట్టాడు. దీంతో గాయపడిన మధన్‌మోహన్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు విచారించి ధీరజ్‌రెడ్డిపై కేసునమోదు చేశారు.

ఉద్యోగ ప్రాప్తిరస్తు..!

నేటి యువతరం ఆలోచనలు మారాయి.. తమకు అభిరుచి, ఆసక్తి ఉన్న ఉద్యోగం కోసం, తమ విద్యార్హతకు తగిన కొలువు లభించే వరకు పట్టువీడటం లేదు. కోరుకున్న కొలువును పట్టేందుకు సంప్రదాయమైన సరికొత్తబాటను పట్టారు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్–2 ద్వారా పెద్దసంఖ్యలో పోస్టులను భర్తీ చేయనున్న నేపథ్యంలో పోటీ పరీక్షలు, గ్రూప్–2 పరీక్షకు సంబంధించి సాక్షి మీడియా గ్రూపు, హైదరాబాద్ ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో కడప నగరంలో ఆదివారం నిర్వహించిన అవగాహన సదస్సు ఎందరో నిరుద్యోగుల్లో స్ఫూర్తిని నింపింది.

- శిక్షణతో భవితకు నిచ్చెన
- గ్రూప్–2 పోస్టుల భర్తీకి ప్రభుత్వం శ్రీకారం
- సాక్షి మీడియా గ్రూపు, ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ ఆధ్వర్యంలో గ్రూప్–2 ఉద్యోగాలపై అవగాహన సదస్సు
- హాజరైన ఫ్యాకల్టీలు అబ్దుల్ కరీం, కృష్ణారెడ్డి, పాషా, హరికృష్ణ

వైవీయూ/కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని హరిత టూరిజం ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఉదయం సాక్షి మీడియా గ్రూపు, హైదరాబాద్ ఆర్.సి. ఎగ్జామ్స్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో గ్రూపు–2 పోటీపరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇప్పటికే రాష్ట్రంలో వేలసంఖ్యలో ఉద్యోగాలను భర్తీ చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం త్వరలో గ్రూప్–2 ద్వారా పెద్దసంఖ్యలో ఉద్యోగాలు భర్తీ చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్న సమయంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల విద్యార్థులు పోటీపరీక్షల్లో విజయం సాధించడమే లక్ష్యంగా.. ఇందుకు అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు పోటీపరీక్షల్లో నిష్ణాతులుగా పేరొందిన అధ్యాపకులు డాక్టర్ అబ్దుల్ కరీం(హిస్టరీ), సి. హరికృష్ణ (సైన్స్‌అండ్ టెక్నాలజీ), ఎండీ పాషా (ఎకానమీ), బి. కృష్ణారెడ్డి (పాలిటీ) విచ్చేసి అభ్యర్థులకు మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్ ఆర్.సి. ఎగ్జామ్స్ సంస్థ చైర్మన్ ఎం. కిరణ్‌కుమార్ మాట్లాడుతూ వివిధ సబ్జెక్టుల్లో నిష్ణాతులైన లెజండరీ ఫ్యాకల్టీలతో ఆన్‌లైన్ విధానంలోను, ఆఫ్‌లైన్ విధానంలోను శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఆన్‌లైన్ విధానంలో వేలసంఖ్యలో అభ్యర్థులు మా వద్ద శిక్షణ పొంది ఉద్యోగాలు సాధించారన్నారు. సాక్షి అడ్వర్‌టైజ్‌మెంట్ రీజినల్ మేనేజర్ డి. సుబ్బారెడ్డి మాట్లాడుతూ పోటీపరీక్షల అభ్యర్థులకు సాక్షి భవిత, సాక్షి ఎడ్యుకేషన్.కాం ద్వారా అద్భుతమైన మెటీరియల్‌ను అందిస్తోందన్నారు. అభ్యర్థులు ఇలాంటి అవగాహన సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సాక్షి సర్క్యులేషన్ తెలంగాణ ప్రాంత మేనేజర్ ఎం. శివకుమార్‌రెడ్డి పోటీపరీక్షలకు సంబంధించి సాక్షి అందిస్తున్న మెటీరియల్, సమాచారం గురించి వివరించారు. పోటీపరీక్షల నిపుణులు గ్రూప్–2 పరీక్ష విధి విధానాలు, మార్కులు సులువుగా సాధించే అంశాలపై మెలకువలు, ఉదాహరణలతో వివరించారు. అనంతరం అభ్యర్థులకు నమూనా టాలెంట్ పరీక్ష నిర్వహించి, ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలిచిన అభ్యర్థులకు నగదు బహుమతులు, స్టడీ మెటీరియల్, తర్వాత స్థానాల్లో నిలిచిన 20 మందికి ప్రామాణిక స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో సాక్షి బ్యూరో ఇన్‌చార్జి ఎం. బాలకృష్ణారెడ్డి, అడ్వర్‌టైజ్‌మెంట్ మేనేజర్ చాముండేశ్వరి, ఈవెంట్ మేనేజర్ చంద్రశేఖర్, పెద్దసంఖ్యలో అభ్యర్థులు పాల్గొన్నారు.





ప్రథమస్థానంలో నిలిచిన రామాంజులమ్మకు బహుమతి అందజేస్తున్న ఆర్.సి. ఎగ్జామ్స్ సంస్థ నిర్వాహకులు, అధ్యాపకులు, హాజరైన అభ్యర్థులు

చక్కటి మార్గనిర్దేశం..



గ్రూప్–2, పోటీపరీక్షల్లో విజయం సాధించాలంటే అభ్యర్థులు తీసుకోవాల్సిన అంశాలపై నిపుణులైన ఫ్యాకల్టీ చక్కటి మార్గనిర్దేశం చేశారు. పోటీపరీక్షలకు తొలిసారిగా పోటీపడే అభ్యర్థులు సైతం తక్కువ సమయంలో ఎలా విజయం సాధించవచ్చో వివరించారు. అవగాహన సదస్సు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించింది.

- జి. అనుష్క, బీటెక్ ఈసీఈ, కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాల, కడప

స్ఫూర్తిని కలిగించారు..



అభ్యర్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందడంతో పాటు వారిలో నిత్యం విజయకాంక్ష ఉండేలా స్ఫూర్తిని రగిలించారు. ప్రణాళికబద్ధమైన సాధన విజయాన్ని సాధిస్తుందని, ఉదాహరణలతో చెప్పిన తీరు అద్భుతం. గ్రూప్స్‌కు సన్నద్ధమవుతున్న నాలాంటి అభ్యర్థులకు ఈ అవగాహన సదస్సు ఒక వరం లాంటిది.

- వై.పి. రాజు, ఎంఎస్సీ, బీఈడీ, మాచునూరు, పెండ్లిమర్రి

ఆత్మవిశ్వాసం పెరిగింది..



ఇటీవల నిర్వహించిన పోటీపరీక్షల్లో రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించాను. గ్రూప్–2, గ్రూప్–1 కు సన్నద్ధం అవుతున్న సమయంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేయడంతో ఇక్కడి విచ్చేసి సదస్సులో పాల్గొన్నా. పేరొందిన ఫ్యాకల్టీలు చెప్పే అనుభవాలు, మెలుకువలు నాలో మరింత ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాయి. **- రాము, జూనియర్ అసిస్టెంట్, రెవిన్యూశాఖ, కడప**

ఉన్నత కొలువుల సాధనకు దిక్సూచి..



ఉన్నత కొలువులు సాధించాలని సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు ఇలాంటి అవగాహన సదస్సులు ఒక దిక్సూచిలా ఉపయోగపడతాయి. ఇందుకు కృషిచేసిన సాక్షి యాజమాన్యానికి ధన్యవాదాలు. ఇటీవల కానిస్టేబుల్ పరీక్షల్లో విజయం సాధించాను. ఉన్నత కొలువు సాధించాలన్న నా లక్ష్యానికి ఈ సదస్సు ఒక చక్కటి మార్గనిర్దేశం చేసింది.

- ఎస్. రమణి, టక్కోలి, సిద్ధవటం



మాట్లాడుతున్న ఆర్.సి. ఎగ్జామ్స్ సంస్థ చైర్మన్ ఎం. కిరణ్‌కుమార్

అత్యుత్తమ గ్రూప్-2 శిక్షణ అందిస్తున్నాం



పోటీపరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో రాష్ట్రంలోనే అత్యుత్తమ శిక్షణను ఆర్.సి. ఎగ్జామ్స్ ద్వారా అందిస్తున్నాం. రాష్ట్రంలోని అత్యుత్తమ ఫ్యాకల్టీలందరూ మా సంస్థలో బోధిస్తున్నారు. వారి సహకారంతో జూన్ 19 నుంచి ఏపీ గ్రూప్–2 బ్యాచ్‌కు అడ్మిషన్లు ప్రారంభిస్తున్నాం. హైదరాబాద్‌కు రాలేని ప్రైవేట్ ఉద్యోగులు, గృహిణులు, ఇతర విద్యార్థుల కోసం ఆర్.సి. ఎగ్జామ్స్ మొబైల్ యాప్ ద్వారా తెలుగు, ఇంగ్లీషు మీడియంలలో శిక్షణ అందిస్తున్నాం. పూర్తి వివరాల కోసం 8985093399, 8985094499 నంబర్లలో సంప్రదించాలి.

- మొండెం కిరణ్‌కుమార్, ఆర్.సి. ఎగ్జామ్స్ సంస్థ చైర్మన్, హైదరాబాద్

ప్రశ్నపత్రం స్థాయికంటే ప్రిపరేషన్ ఉన్నతంగా ఉండాలి



పోటీపరీక్షల్లో మన ప్రిపరేషన్ ప్రశ్నపత్రం స్థాయికంటే ఉన్నతంగా ఉండాలి. పరీక్షల స్టాండర్డ్ ఎప్పటికప్పుడు పెరుగుతున్న నేపథ్యంలో శిక్షణ కఠినతరంగా ఉండాలి. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లలో శిక్షణ లభిస్తున్నప్పటికీ ఆఫ్‌లైన్‌లో పొందే శిక్షణ ద్వారా పోటీతత్వం తెలుస్తుంది. పోటీతీవ్రతను దృష్టిలో ఉంచుకుని పక్కవాని కంటే ఒక మార్కు ఎక్కువ సాధించేలా శ్రమించాలి. ఎప్పటికప్పుడు సబ్జెక్టులో అప్‌డేట్ కావాలి. నిష్ణాతులైన, అనుభవం కలిగిన లెజండరీ ఫ్యాకల్టీ ఒకేచోట దొరికే శిక్షణ కేంద్రం ఆర్.సి. ఎగ్జామ్స్ సెంటర్.

- డాక్టర్ ఎం. అబ్దుల్ కరీం, హిస్టరీ ఫ్యాకల్టీ

విజయానికి సోపానం మార్గదర్శనం



అభ్యర్థులు విజయం సాధించేందుకు గైడెన్స్ ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఇతరుల అనుభవాలను తీసుకోవడం ద్వారా విజయం సాధించవచ్చు. గైడెన్స్ గెట్ విన్. విజేతల ఇంటర్వ్యూలతో పాటు పరాజితుల ఇంటర్వ్యూలను ఆదర్శంగా తీసుకోవాలి. ఏమి చేయాలో.. ఏమి చేయకూడదో తెలుసుకుంటే విజయం మనదే. సబ్జెక్టును మనచుట్టూ ఉన్న పరిస్థితులకు అనుగుణంగా అన్వయించుకోవాలి. ఎక్కువసార్లు సాధన చేయడమే విజయరహస్యం. సంక్షిప్తత నుంచి సరళత్వం దిశగా సాధన ఉండాలి. నాణ్యమైన కంటెంట్‌ను చదవడంతో పాటు సిలబస్‌ను లోతుగా చదవాలి.

- సి. హరికృష్ణ, సైన్స్ అండ్ టెక్నాలజీ ఫ్యాకల్టీ

నోటిఫికేషన్ వచ్చేలోపు సిలబస్ పూర్తి చేయాలి



పోటీప్రపంచంలో సమయం ఎంతో విలువైనది. నోటిఫికేషన్ జారీచేసే లోపు సిలబస్‌ను పూర్తి చేయడం ద్వారా ప్రిపరేషన్‌లో ముందు ఉండవచ్చు. పోటీపరీక్షల కోసం నిరుద్యోగ అభ్యర్థులు పెట్టుబడి పెట్టేది కేవలం విలువైన సమయం మాత్రమే. ఎకానమీ సబ్జెక్టు అభ్యర్థుల విజయాన్ని డిసైడ్ చేస్తుంది. సరైన ప్రణాళిక విజయానికి బాటలు వేస్తుంది. రగిలే జ్వాల ఉండటం ద్వారా నిరుద్యోగ అభ్యర్థులు ఉద్యోగసాధనలో పడే కష్టం ప్రసవవేదనలాంటిదన్నారు. ఉద్యోగం సాధించిన తర్వాత వచ్చే హోదా, గుర్తింపు మనంలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతాయి. 100 శాతం రాజీలేని సబ్జెక్టు బోధన అందించడమే మా సంస్థ విజన్.

- ఎం.డి. పాషా, ఎకానమీ ఫ్యాకల్టీ

వైవిధ్య ఆలోచనే విజయానికి సోపానం..



పోటీపరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు ప్రతి అక్షరాన్ని గరిష్ఠంగా ఉపయోగించుకోవాలి. ప్రశ్నలు ఎలా వస్తాయో ఊహించేలా సబ్జెక్టుపై పట్టు సాధించాలి. ఇందుకు తగ్గ విజయప్రణాళికను సిద్ధం చేసుకోవాలి. ప్రస్తుతం ఆలోచించడం మరిచిపోయి.. అనుకరించడం చేస్తున్నారని, అలా కాకుండా ఆలోచన రేకెత్తించేలా.. వైవిధ్యంగా ఆలోచించడం, సృజనాత్మకతను జోడించడం ద్వారా విజయం సాధ్యమవుతుంది. సబ్జెక్టుపై అవగాహన పొందడం ద్వారా సమగ్రత వస్తుంది. విజయంతో విశ్వాసం ద్విగుణీకృతం అవుతుంది. పాలిటీలో గ్రాఫ్స్, విస్తృతి, అనువర్తిత విషయాలపై దృష్టి సారించాలి.

- బి. కృష్ణారెడ్డి, పాలిటీ ఫ్యాకల్టీ

ఏఎంసీ ఆస్తుల ధ్వంసం కేసులో 8మందిపై కేసు

మదనపల్లె : ఆరోగ్యవరం మెడికల్ సెంటర్‌లో(ఏఎంసీ)కి అక్రమంగా ప్రవేశించడమే కాకుండా ఆస్తులను ధ్వంసం చేసిన ఘటనలో ఎనిమిది మందిపై కేసు నమోదుచేసినట్లు తాలూకా సీఐ సత్యనారాయణ తెలిపారు. ఆరోగ్యవరం డైరెక్టర్ పదవికి సంబంధించి డాక్టర్. వెస్లీ, రాయలసీమ సీఎస్‌ఐ డయాసిస్‌కు మధ్య కొంతకాలంగా విభేదాలు నడుస్తున్నాయి. ఈ క్రమంలో మే 4వతేదీ రాయలసీమ డయాసిస్ బిషప్. రెవ. డాక్టర్. పి.ఐజాక్ వరప్రసాద్ శానిటోరియం-ఏఎంసీ నూతన డైరెక్టర్‌గా జమ్మలమడుగు సీఎస్‌ఐ క్యాంప్‌బెల్ ఆస్పత్రిలో కంటివైద్యులుగా పనిచేస్తున్న డాక్టర్.కే.పీ.రవీంద్రను, కత్రినా మొల్లర్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్, ఆరోగ్యవరం స్కూల్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపాల్‌గా కే.ఆర్.జోయల్ స్వరూప్‌కుమార్‌ను నియమించారు. సీఎస్‌ఐ పాస్టర్ల సమక్షంలో వారిద్దరిచేత ప్రమాణస్వీకారం చేయించారు. వీరిద్దరూ బాధ్యతలు స్వీకరించేందుకు వస్తున్నారని తెలుసుకున్న ఏఎంసీ డైరెక్టర్ బి.వెస్లీ కార్యాలయం, నర్సింగ్‌కాలేజ్‌కు తాళాలు వేసుకుని వెళ్లారు. దీంతో నూతనంగా నియమితులైన డైరెక్టర్, నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ బాధ్యతల స్వీకరణ కోసం వేసిన తాళాలు పగులగొట్టి ఆయా కార్యాలయాల్లోకి ప్రవేశించారు. ఆరోగ్యవరం మెడికల్ సెంటర్ సొసైటీ నిబంధనలకు వ్యతిరేకంగా, చిత్తూరు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జ్ ఉత్తర్వులను పాటించకుండా ఆరోగ్యవరంలోకి ప్రవేశించారని, కార్యాలయ తలుపులను పగులగొట్టి అందులోని విలువైన ఫైల్స్, వ్యక్తిగత వస్తువులను అపహరించుకు వెళ్లారని డైరెక్టర్ వెస్లీ జూన్ 2న తాలూకా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. దీంతో సెక్షన్ 448, 427, 379 రెడ్‌విత్ 34 ఐపీసీ కింద ఏ–1గా బిషప్.రెవ. ఐజాక్‌వరప్రసాద్, ఏ–2గా అన్నీస్‌మోజెస్, ఏ–3గా డాక్టర్. కే.రవీంద్ర (జమ్మలమడుగు), ఏ–4 జోయల్ స్వరూప్‌కుమార్ (జమ్మలమడుగు), ఏ–5 ధనరాజ్, ఏ–6 సూరి, ఏ–7 రెవ. వినయ్ (జమ్మలమడుగు), ఏ–8 కిరణ్(బిషప్ డ్రైవర్)లపై కేసు నమోదుచేసినట్లు తాలూకా సీఐ సత్యనారాయణ తెలిపారు. అయితే ఈ కేసుకు సంబంధించి పోలీసులు ఈనెల 2వతేదీన కేసు నమోదుచేసినప్పటికీ వివరాలు వెల్లడించకపోవడం గమనార్హం. ఆరోగ్యవరం మెడికల్ సెంటర్ వివాదానికి సంబంధించిన ఎఫ్ఐఆర్ సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, ట్విట్టర్, వాట్సాప్‌లలో విస్తృతంగా ప్రచారం కావడంతో ఎట్టకేలకు శనివారం వెలుగులోకి వచ్చింది.

మహిళ దారుణ హత్య



లక్ష్మీదేవమ్మ (ఫైల్)

రామసముద్రం : రామసముద్రం మండలం కుదురుచీమనపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని ఓబులరెడ్డిపల్లె సమీపంలోని ప్రకాష్‌రెడ్డి పొలంలో లక్ష్మీదేవమ్మ (54) అనే మహిళ దారుణ హత్యకు గురైంది. ఈ సంఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. మృతురాలి భర్త శంకర్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రెండు సంవత్సరాలుగా భార్యతో కలసి ఓబులరెడ్డి పల్లి సమీపంలో ఉన్న ప్రకాష్‌రెడ్డి పొలంలో కూలి పని చేసుకుని జీవనం చేస్తున్నాడు. శుక్రవారం తన సమీప బంధువు మృతి చెందడంతో తాను అక్కడికి వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చే సరికి తన భార్య రక్తపు మడుగులో పడి ఉందన్నారు. వెంటనే విషయాన్ని పుంగనూరు పోలీసులకు తెలియజేశాడు.వారు వచ్చి పరిశీలించి తమ పరిధి కాకపోవడంతో రామసముద్రం పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ చంద్రశేఖర్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతురాలి భర్తను విచారించారు. శనివారం ఉదయం మదనపల్లె డీఎస్పీ కేశప్ప, ఎస్‌ఐ చంద్రశేఖర్ మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం పుంగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. శంకర్‌రెడ్డి చెప్పిన వివరాల మేరకు తన కుమార్తై చౌడేపల్లెలో భర్తను కోల్పోయి జీవనం చేస్తుందన్నారు. ఈ నేపథ్యంలో కొరియర్ బాయ్‌గా పని చేస్తున్న అరికెల పంచాయతీ గోసువారిపల్లికి చెందిన అంజన్‌కుమార్ తన కుమార్తైకు కొరియర్లు తీసుకొని వచ్చి ఇస్తూ పరిచయం పెంచుకుని ఆమెను వివాహం చేసుకోవాలని ప్రయత్నించాడని, అయితే తాము ఒప్పుకోలేదన్నారు. దీంతో తమపై కక్ష పెంచుకుని తన భార్య గొంతుకోసి వెళ్లి ఉంటాడని అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులు అంజన్‌కుమార్ కోసం గాలించినా ఆచూకీ లభించలేదు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వాట్సాప్‌లో హల్‌చల్ చేస్తున్న పింక్ లింక్

కలికిరి : ఇంటీవల వాట్సాప్‌లో వాట్సాప్ అప్‌డేట్ పేరుతో పింక్ లింక్ హల్‌చల్ చేస్తోంది. దీనిపై పోలీసులు మొబైల్ వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నారు. ఏ మొబైల్ అప్లికేషన్ అయినా అప్‌డేట్ ప్లేస్టోర్‌లో మాత్రమే వస్తుంది. లింక్‌ల రూపంలో రాదు. లింక్ రూపంలో వచ్చిందంటే యూజర్‌ల వ్యక్తిగత సమాచారం చోరీ అయ్యే ప్రమాదం ఉంటుందన్నారు. ఇలాంటివి ఓపెన్ చేసినప్పుడు వచ్చే ఓటీపీ ఎంటర్ చేసిన వెంటనే ఆ లింక్ షేర్ అవుతుందన్నారు. పొరపాటున ఓపెన్ చేసిన వారు వెంటనే పింక్ కలర్ వాట్సాప్, ఆన్‌లైన్ స్ట్రీమ్‌ను అన్ ఇన్‌స్టాల్ చేస్తే లింక్ షేర్ అవ్వకుండా ఆపవచ్చన్నారు.

పేదింటి వాలీబాల్ క్రీడాకారులకు ఎమ్మెల్యే చేయూత



క్రీడాకారులకు నగదు అందచేస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

రాజంపేట టౌన్ : రాజంపేట మండలం కూచివారిపల్లెకు చెందిన తేజ, సరిత, సాయిప్రతాప్ వాలీబాల్ క్రీడలో ప్రతిభ చూపుతూ జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తున్నారు. వీరిపై ఈనెల 5వ తేదీన 'సాక్షి'లో పేదింటి బిడ్డలు – వాలీబాల్‌లో మెరికలు శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి స్పందించారు.శనివారం ఆ క్రీడాకారులను తన కార్యాలయానికి పిలిపించి తాత్కాలికంగా రూ.5వేలు ఆర్థిక సాయం చేశారు. అలాగే జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్‌కు క్రీడాకారుల పేదరికం గురించి తెలియ చేసి వారి కుటుంబానికి మూడు ఎకరాల భూమి, పక్కాగృహం మంజూరుకు చేయించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. తన వంతు సహాయ, సహకారాలు ఎప్పుడు ఉంటాయని ఈసందర్భంగా క్రీడాకారులకు ఆయన భరోసా ఇచ్చారు.రాజంపేటకు వాలీబాల్ క్రీడతో దేశవ్యాప్తంగా గుర్తింపు ఉందని, ఆ గుర్తింపును ఇలాగే కొనసాగించాలని సూచించారు. ఈకార్యక్రమంలో రిటైర్డ్ పీడీ, వాలీబాల్ కోచ్ ఎస్.షామీర్ బాషా, జేసీఎస్ పట్టణ ఇన్‌ఛార్జ్ వడ్డే రమణ, వైఎస్సార్ సీపీ నాయకులు కూండ్ల రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

బి.కొత్తకోట : బెట్టింగ్‌లకు పాల్పడి డబ్బు నష్టపోయిన ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన శనివారం బి.కొత్తకోటలో జరిగింది. పోలీసులు, కుటుంబీకుల కథనం మేరకు వివరాలు..స్థానిక పీటీఎంరోడ్డుకు చెందిన వెంకటేష్ (24) ఓ దుకాణంలో పనిచేసుకొంటూ జీవిస్తున్నాడు. కొంతకాలంగా క్రికెట్ బెట్టింగ్‌లు వేస్తున్నాడు. దీని కోసం రూ.6-7 లక్షల అప్పులు చేశాడు. అప్పులు అధికమై తీర్చే మార్గం లేకపోవడంతో ఇబ్బందులకు గురయ్యాడు. దీంతో ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబీకులు కాపాడే ప్రయత్నం చేశారు. 108కు సమాచారం ఇవ్వడంతో బాధితున్ని స్థానిక సీహెచ్‌సీకి తరలించి వైద్యం అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించగా ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. దీనిపై విచారణ చేస్తున్నామని హెడ్‌కానిస్టేబుల్ ఎం.రవీంద్రనాయక్ తెలిపారు.